# ప్రతి మానవుడు ప్రేమదృష్టిని అలవరచుకోవాలి

ఎద్ది కలదనుచుంటిమో అద్ది లేదు
ఎద్ది లేదనుచుంటిమో అద్ది కలదు
ఉన్నదొక్కడే దైవంబు ఎన్నటికిని
లేనిదయ్యెను విశ్వంబు కానరయ్య.

ప్రేమస్వరూపులారా!

దృశ్యమునకు, అదృశ్యమునకు ప్రాకృతతత్త్వము భేదము చూపుతుందిగానీ అధ్యాత్మికతత్త్వము దృశ్యాదృశ్యములను రెండింటిని సమంగానే భావిస్తుంది. ప్రకృతి దృష్టితో చూచినప్పుడిదంతయు ప్రకృతిగా కనిపిస్తుంది. ఎవరిది ఎట్టి దృష్టియో అట్టి సృష్టిగా కనిపిస్తుంది. ఎవరు ఎట్టి రంగు అద్దములు వేసుకుందురో అట్టివారికి అట్టి రంగుగానే కనిపిస్తుంది, యీ ప్రపంచము. ప్రేమదృష్టితో చూచే వ్యక్తికి బాహ్యప్రపంచము అంతా ప్రేమమయముగానే కనిపిస్తుంది. కనుక, ప్రతి మానవుడు ప్రేమదృష్టిని అలవర్చుకోవాలి. అప్పుడే సర్వము బ్రహ్మమయంగా రూపొందుతుంది. శంకరులవారు 'బ్రహ్మసత్యం జగత్‌మిథ్య' అన్నారు. ఈ వేదాంతశిరోమణి రచించిన గ్రంథములను పఠించిన ఒక విద్యార్థి నా దగ్గరకు వచ్చి 'స్వామి! 'బ్రహ్మసత్యం జగత్‌మిథ్య' అని శంకరులవారు చెప్పారు. ఏది సత్యము, ఏది మిథ్య' అని అడిగాడు. అప్పుడు నేను 'పిచ్చివాడా! ఏది సత్యమో, ఏది అసత్యమో ప్రకృతికి వదలిపెట్టు. మొట్టమొదట నీవు సత్యమా కాదా తెలుసుకో'మన్నాను. 'ప్రకృతికి అది వదలు, ప్రకృతే నిర్ణయము చేస్తుంది. ప్రకృతితత్త్వము నీవు ఏమాత్రం విచారించనక్కరలేదు. వాదించనక్కరలేదు. మొట్టమొదట నీవు సత్యమో కాదో తెలుసుకో'మని చెప్పాను. తాను సత్యమా కాదా అని తెలియని వ్యక్తి, ప్రకృతి సత్యము, నిత్యము అని చెప్పటానికి ఏ విధంగా అర్హుడౌతాడు? కనిపించే దేహమునే సత్యముగా

srisathyasaivachanamrutam

భావిస్తున్నాడు. కనిపించని దేహిని అసత్యముగా విశ్వసిస్తున్నాడు.

**దృశ్యకల్పితమైన జగత్తంతయు మార్పు చెందునదే!**

'కనిపించనిదే తినిపించును నీ కర్మఫలముల మర్మము దేవా' ఏది కనిపించదో అదే నీ సుఖఃదుఃఖములకు మూలకారణము. 'అందము, ప్రాయము, ఇంద్రియశక్తియు ఉన్నదని నిక్కకురోరన్నా ముందున్నది తొందరలోనే ముసలితనమను ముసుళ్ళ పండుగ'. ఇప్పటికిది సత్యమని నీవు భావిస్తున్నావు. కొన్ని దినములకు యిది సత్యమా అసత్యమా! దృశ్యకల్పితమైన జగత్తంతయు మార్పు చెందునదే! మార్పులేనిదేదో అదే సత్యము. పిల్లలు చాలామందికి ఈ ఆధునిక యుగములో గొప్ప ఫ్యాషనుగా ఉంటుంది, సినిమా చూడటము, టీవి చూడటము యివిలేక వారు ఉండలేరు. టిక్కట్టు తీసుకొని సినిమాహాలులో ప్రవేశిస్తారు. పోయిన తక్షణమే తెల్లని పెద్ద స్క్రీను కనిపిస్తుంది. కానీ ఆ స్క్రీనుపై బొమ్మలు ఎప్పుడు వస్తాయా, ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తుంటారు. బొమ్మలు వచ్చెనా అతనికి ప్రాణం లేచివచ్చినట్టు అనిపిస్తుంది. బొమ్మలు వచ్చినాయి. వచ్చినాయని అనందిస్తుంటున్నాడు గానీ ఆ బొమ్మలు పోతున్నాయి. మరొక బొమ్మలు మరొక రీతిగా ఆడుతున్నాయి. ఈ విధంగా వస్తున్నాయి, పోతున్నాయి బొమ్మలు. అదే రీతిగా ఈ జగత్తనే దృశ్యము రావటము, పోవటము జరుగుతుంది. ఈ రావటం, పోవటం దేని ఆధారముతో మనం చూడగల్గుతున్నాము? స్క్రీను ఆధారంతో చూడగల్గుతున్నాం. స్క్రీను రావటంలేదు, పోవటంలేదు. స్క్రీను సత్యము, బొమ్మలు మిథ్య. అయితే అదే శంకరులవారు 'సర్వం ఖల్విదం బ్రహ్మ', అంతా బ్రహ్మస్వరూపమే అన్నారు. అయితే ఈ మిథ్యయైన బొమ్మలుకూడా భగవత్స్వరూపమేనా? ఎట్లా? సత్యమైన స్క్రీనుపైన మిథ్యయైన బొమ్మలు పడినప్పుడు ఈ బొమ్మలలోకూడా స్క్రీను ఉంటున్నాది. స్క్రీనులేక బొమ్మలు కనిపించవు. బొమ్మలకు ఆధారమైనది స్క్రీనే! ఆ బొమ్మలలో కనిపించేదీ స్క్రీనే. కనుక 'సర్వం ఖల్విదం బ్రహ్మ'. యిట్టి సత్యమును గుర్తించుకునే వ్యక్తిత్వము ఈ ఆధునిక యుగములో చాలావరకు దిగజారిపోయింది. దేహము సత్యమని భావిస్తున్నారు. దేహి అసత్యమని భావిస్తున్నారు. కానీ, దేహముతోనే దేహిని మనం కనుక్కోవాలి. దేహము ఎట్టిది?

sri sathyasai vachanamrutam

## అనిత్యమైన దేహముద్వారా నిత్యసత్యమైన ఆత్మను గుర్తించుటకు ప్రయత్నించాలి

ఈ దేహమునకు మూడు స్థితులుంటున్నాయి. ఒకటి వాత, పిత్త, శ్లేష్మములు. వాతము ప్రతి మానవునికి దేహములో 80 రకములైన వ్యాధులు తెప్పిస్తుంది. పిత్తము 82 రకములైన రోగములను యీ దేహములో కలిగిస్తున్నాది. శ్లేష్మము 224 రోగములను కల్పిస్తున్నాది. ఇవన్నీ చేరి 386 రకములైన రోగములు మానవునిలో ఉంటున్నాయి. ఇన్ని రోగములతోకూడిన యీ దేహముపై ఎందుకింత భ్రాంతి? ఆనాటి మహర్షులందరు దేహముయొక్క తత్వము చక్కగా గుర్తించి ఈ దేహముపై భ్రాంతి వదలి క్రమక్రమేణా ఉన్నంతవరకు దీని క్షేమాన్ని కాపాడుకుంటూ వచ్చారు. ఏమిటి రోగము? కనిపించే రోగముకాదే! కొందరు హాయిగా ఉంటుంటారు. పకోడా మాదిరి ఉంటుంటారు. రోడ్డురోలరువలె ఉంటుంటారు. రోగాలు కనిపించవు. కానీ దాహముకూడా ఒక రోగమే. ఆకలికూడా ఒక రోగమే! కదలిక ఒక రోగమే! ఉచ్ఛ్వాసనిశ్వాసములు రోగమే, మాటలు రోగమే, ఆటలు రోగమే, నడకలు రోగమే, నవ్వులు రోగమే, అంతా రోగములే! ఎక్కువ నవ్వవద్దు. గుండె పడుతుంది. ఆ నవ్వుతోనే గుండె పడుతుంది. కనుక, ఏది రోగము. ఏది ఆరోగ్యము అని ఎవరూ చెప్పటానికి వీలుకాదు. రోగముల గంప ఈ దేహము. అంతేకాదు. 'నిముషనిముషముకు నీచులూరునెగాని, పునుగు జవ్వాదీలు పుట్టబోవు, మలమూత్రదుర్గంధ మాంసరక్తమెగానీ, పునుగు జవ్వాదీలు పుట్టబోవు'. ఇది మానవుని దేహ స్వభావము. 'దేహము పాంచభౌతికము దేహము కూలకతప్పదెప్పుడున్'. ఇది కూలిపోయి, కాలిపోయేటువంటిది. కానీ దేహి నిత్యసత్యమై ఉండేది. అనిత్యమైన దేహముద్వారా నిత్యసత్యమైన ఆత్మను గుర్తించుటకు ప్రయత్నించాలి.

## జీవులయొక్క ఆనందమే దైవముయొక్క ఆనందము

దేహానికి సంబంధించిన అనుకూలముల నిమిత్తమై మనము అనేక రీతులుగా పాటు పడుతున్నాము. కానీ దేహి ఆనందనిమిత్తమై మనము ఏ మాత్రమైనా విచారము చేస్తున్నామా? ఈ నీ సంతోషముకోసమని, నీ అనుకూలముకోసమని నీవు ప్రాకులాడుతున్నావేగానీ, దేహియొక్క తృప్తి, దైవముయొక్క తృప్తి, దైవముయొక్క వాంఛ,

sri sathyasai vacahnamrutam

దైవముయొక్క లక్ష్యము ఏమిటి అనేది ఏ మానవుడు విచారించటంలేదు. దైవముయొక్క ఆనందము ఏమిటి? జీవులయొక్క ఆనందమే దైవముయొక్క ఆనందము. కనుక నీవు happy గా ఉండు. I want happiness అంటారు. Happiness ఎక్కడనుంచి వస్తుంది? వస్తువునుంచి వస్తుందా? బంధువులనుంచి వస్తుందా లేక విషయములనుంచి వస్తుందా? ధనకనకవస్తువాహనాదులనుంచి వస్తుందా? కాదుకాదు. Happiness is UNION with GOD. అక్కడనుండి వస్తుంది యిదంతా! అయ్యో! యీ కరెంటు ఎక్కడనుంచి వస్తున్నాదంటే ఆ బల్బు దగ్గరనుండి ప్రయాణము చేసుకుంటూ వెళ్లు, తిరిగి ఆ వైరు ఎక్కడ పోయి చేరుతుందో చూడు. అక్కడ Generator ఉంటుంది. అక్కడనుండి వస్తున్నాది కరెంటు. ఈ కాళ్లు, ముక్కు, చేతులు, కళ్లు యివన్నీ బల్బుల వంటివే! యివన్నీ ఆధారము చేసుకొని ప్రయాణము చేయి. ఎక్కడకు పోయి చేరుతుంది? హృదయము దగ్గరకుపోయి చేరుతుంది. ఒక కారు ఉంది. కారుకు లైట్లు కనిపిస్తున్నాయి. హారను వినిపిస్తున్నాది. దేనివల్ల జరుగుతున్నాదని విచారణచేస్తే అక్కడ బ్యాటరీవుంది. ఆ బ్యాటరీకి కనెక్షన్ అయివుంది. ఆ బ్యాటరీ ఈ హృదయము. ఆ హృదయస్థాయిని యీనాడు మరచిపోతున్నారు. అన్నీ హృదయముద్వారానే జరిగిపోతున్నాయి. ఈనాటి మానవుడు ప్రేమలేని బండగుండువలె కనిపిస్తున్నాడు. ప్రేమరహితమైన మరుభూమిగా ఉంటున్నాయి, యీనాటి మానవహృదయాలు. ప్రేమ ఉండినట్టు నటిస్తున్నారే గాని ప్రేమకించిత్తైనా కనిపించటంలేదు. ఏదైనా కనిపించినప్పుడు 'నమస్కారమండి!' అంటారు. నవ్వినట్టుగా ఉంటుంది. కానీ, ఆ నవ్వు హృదయమునుంచి వచ్చింది కాదు. సినిమా నవ్వులు, acting చేయటం. లోపలనుంచి వచ్చే ఆనందము, హృదయమునుండి వచ్చే ఆనందము, ముఖములో నిరూపిస్తుంది. Reflection of inner being. దేహితత్వమును మనము చక్కగా గుర్తించాలి. దేహము ఎన్నో రోగములతో కూడినది.

**మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మన మెప్పుదలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.**

srisathyasaivachanamrutam

ఏమిటి ఈ దేహము? కుళ్ళిన ఉల్లిపాయ ఎంత కంపు కొడుతుందో అంత కంపుకొడుతుంది ఈ దేహము. అందులో రోగములగంప. ఎక్కడ చూచినా ఎముకలు అంబులపొదిమాదిరి ఉంటున్నాయి. ఏమిటి ఈ దేహములోని ప్రత్యేకత?

**దేహములోనున్న ప్రత్యేకత దేహి ఒక్కటే!**

ఈ దేహములోనున్న ప్రత్యేకత ఒక్కటే, అదే దేహి! అదే అన్నింటిని సంరక్షిస్తున్నది. ఎముకలను పోషిస్తున్నాది. కండలకు బలమిస్తున్నది. రక్తమును పరిశుద్ధము చేస్తున్నాది. నిజంగా చాలా విచిత్రంగా ఉంటుంది. ఇది భగవంతుని సృష్టి. ఎంత చిత్రంగా ఉంటున్నాది!

**చిత్రంబులు త్రైలోక్యప**
**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు ముని జన వన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

ఇంత విచిత్రము, ఇంత పవిత్రమైన దైవత్వమును ఏ మానవుడైనా తెలుసుకోటానికి ప్రయత్నిస్తున్నాడా? తొమ్మిది చిల్లులతోలుతిత్తిని పట్టుకొని ఆట ఆడుతున్నావు. అందుకోసమే ఆనాడు మహనీయులందరు 'జాగ్రత్త జాగ్రత్త', అని చెబుతూవచ్చారు. ఈ దేహము 'తైతైతైతై బొమ్మా దీని తమాషా చూడర తోలు బొమ్మ'. ఏమిటి ఈ తమాషా? కన్నులు మసకలు వస్తున్నాయి. నొసట ముడతలు పడుతున్నాయి. పండ్లు ఊడుతున్నాయి. వెంట్రుకలు నెరుస్తున్నాయి. ఈ అన్నింటికి ఎవరు కారణము? ఏది కారణము? ఈ దేహము రోగములతో నిండినదే! అయితే ఈ రోగములను మంచి రోగములుగా మనం మార్చుకోవాలి. ఎట్టి రోగము? దైవమువైపు మరల్చే రోగమును తెచ్చుకోటానికి మనం ప్రయత్నించాలి.

**దైవమునకు అందరూ సమానులే!**

దైవము కొందరిపైన అనుగ్రహము అధికంగా చూపుతుంటాడు. కొందరిపైన చూపీచూపనట్టుంటాడు. కొందరిపైన చూపనట్టే కనిపిస్తాడు. కానీ, అది నీ భ్రాంతియేగానీ

sri sathyasai vachanamrutam

మరొకటికాదు. దైవమునకు అందరు సమానులే! అద్దములో చూడండి. మీ ముఖము మీకు కనిపిస్తుంది. ఆ అద్దమునకు మరొకవైపున 'ప్రేమ' అనే రసాయనము పూసినప్పుడు నీ ప్రతిబింబము అందులో కనిపిస్తుంది. కాబట్టి, ఎవరి హృదయమునకు ఈ ప్రేమ అనే రసాయనము పూసి ఉంటారో వారి దగ్గర మాత్రమే యిది కనిపిస్తుంది. కనిపించకపోవటం దైవముయొక్క దోషము కాదు. నీవు ఆ రసాయనము పూయలేదు. అలా పూయకపోవటంచేత మరొక రోగము ప్రారంభమవుతున్నాది. ఏమిటీ రోగము? 'జెలసీ' అనగా అసూయ. పటేలు, బాబాకు పదవసం॥లో ఆ పిల్లవానిని తీసుకొని వెంకుసా దగ్గరకు వెళ్లాడు. పటేలుకు అంతకుముందు ఒక స్వప్నము వచ్చింది. 'పటేల్! నీవు ఎంత కాలమో ఉండవు. నీవు పెంచిన యీ పిల్లవానిని యింక ఎవరూ సాకలేరు. ఫలానా చోట 'వెంకుసా' అని ఒకాయన ఉంటాడు. అతని దగ్గర ఈ పిల్లవానిని వదలి పెట్ట'మని ఎవరో అతనికి స్వప్నములో చెప్పారు. వెంకుసా గురువువలె పిల్లలకు చక్కగా ఆధ్యాత్మికతత్త్వము ప్రబోధిస్తూవచ్చాడు. ఈ పిల్లవాడు వస్తుండగనే అందుకొరకే తాను కాచుకున్నట్టు అనిపించింది, వెంకుసాకు. 'ఆవోబా, ఆవోబా' అని పిల్చాడు. పిల్లవానిని దగ్గర కూర్చోబెట్టుకున్నాడు. తలనిమిరాడు, భుజాలు నిమిరాడు. 'ఇంతకాలం నీకోసం కాచుకున్నాను నాయనా!' అని అనేక విధములుగా అతనిని ముచ్చటలాడి 'లోపలికి పోయి భోజనం చేసి రా! పో' అన్నాడు. అప్పటినుంచి ఈ పిల్లవానిపై వెంకుసాకు ప్రేమ అధికమవుతూ వచ్చింది. ఈ ప్రేమను చూచి అక్కడున్న విద్యార్థులలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. 'ఏమి? మేము యిన్ని సంవత్సరములనుంచి యిక్కడుంటున్నామే, గురువుగారు మావైపు కనీసం చూడటంలేదే! ఇప్పటికిప్పుడే వచ్చాడు. ఈ పిల్లవానితో ఏమిటీ విధముగా మాట్లాడుతున్నాడు?', అని వీరిలో వీరికి కలతలు పెరిగాయి. వారిలోవారు రకరకాలుగా మాట్లాడుకున్నారు. కొంతమంది మంచిగా 'ఏమో అతని అదృష్టము. జన్మాంతర సుకృతమ'ని అన్నారు. కొంతమంది 'ఆ పటేలు ధనవంతుడు. అతని దగ్గరనుంచి ధనము వస్తుందని ఆశిస్తున్నాడేమో'నని అన్నారు. ఈ విధంగా ఒకొక్కరు ఒక్కొక్క విధంగా మాట్లాడారు. తలలు వేరు వేరైనప్పుడు తలంపులు వేరు వేరుగానే వస్తుంటాయి. 'యద్భావం తద్భవతి' అని చెబుతారు, సంస్కృతములో. భావముకొద్దీ మన

ఊహలు బయలుదేరుతుంటాయి. 'లోకో భిన్నరుచిః' వారి వారి టేస్టులబట్టి తమ తెలివితేటలను ప్రదర్శిస్తూ టైము waste చేసుకుంటారు. ఇలా ఉండగా దినదినమునకు వెంకుసాకు, బాబాకు సన్నిహితసంబంధము ఎక్కువ అవుతూ వచ్చింది. ఒకనాడు పిల్లలంతా ఒక ప్లాను వేశారు. ఇప్పుడు సరైన సమయము. ఈ పిల్లవానిని చంపాలని ప్లాను వేశారు. అప్పుడుగానీ వెంకుసా మనపై ప్రీతి చూపడనుకున్నారు. ఒక గుడిసె ఉంటే అక్కడకు పోయి కూర్చున్నారు. Master plan వేసుకున్నారు. ఒక యిటుక తీసుకున్నారు, బలవంతుడైన ఒక విద్యార్థి విసిరాడు. అది సూటిగా బాబా తల దగ్గరకు వచ్చేటట్టు కనిపించింది. బాబా అంటే ప్రేమ వెంకుసాకు. తక్షణమే తన శక్తితో ఆ యిటుకను తనవైపు తిప్పుకున్నాడు. ఎట్లా? బాబాకు ముందు వచ్చి నిల్చున్నాడు. బాబా తలకు తగలవలసింది వెంకుసా తలకు తగిలింది! తక్షణమే రక్తం కారుతూ వచ్చింది. అప్పుడు బాబా తాను కట్టుకున్న బట్ట చించి గురువు తలకు కట్టాడు. గురుశిష్యులు యిరువురు ఈ రక్తం చూచుకుంటూ మాట్లాడుతూండగనే ఆ పిల్లవాళ్లిద్దరు పరుగెత్తి వచ్చారు, ఒక శవమును తీసుకొని. ఎవరా శవము? బాబాను కొట్టటానికి ఎవరైతే యిటుక వేశాడో వాడు తక్షణమే చనిపోయాడు. 'చెరపకురా చెడెదవు', అన్నారు. 'పరుల తిట్టినంత పాపఫలంబబ్బు, విడువదెన్నటికి, పరులు పరులు కాదయా పరమాత్ముడగునయా'! 'గురుజీ! మా దోషము క్షమించమ'ని ఆ బాలుని శవము గురువు పాదములపై వేశారు. అప్పుడు వెంకుసా చెప్పాడు: 'నాయనా! నేను వృద్ధుడనయ్యాను. నాయొక్క సర్వస్వము యీ పిల్లవాడే! అని అతనిని ప్రేమిస్తూన్నాను. నిర్మలమైన ప్రేమ ఎక్కడఉందో అక్కడ ఆ ప్రేమయే మిమ్మల్ని రక్షిస్తుందిగానీ యింకొకరు రక్షించలేరు'. ఈ మాట వినేటప్పటికి బాబా పాదములపై వేశారు, చనిపోయిన పిల్లవానిని. బాబా ఫక్కున నవ్వాడు. ఎందుకు నవ్వాడు? మమ్మల్ని చంపటానికి ప్లాను వేసినవాడు తానే చచ్చాడనే ఆనందముతోకాదు. 'శతవర్షములదాక మితము చెప్పిరిగాని నమ్మరాదా మాట నెమ్మన్నమున'. నూరు సంవత్సరములంటున్నారు. ఇది నమ్మరాదు. 'ఊరనో అడివినో ఉదకమధ్యంబునో ఎప్పుడో విడిచేది ఎరుకలేదు. బాల్యమందో లేక ప్రాయమందో లేక ముదిమియందో లేక ముసలియందో ఎప్పుడో విడిచేది ఎరుకలేదు. ఇదంతా దేహముయొక్క లక్షణమ'ని హాస్యముగా నవ్వినాడు.

చిన్నవయస్సునందే అట్టి పరమసత్యమును గుర్తించినవాడు, బాబా. దానికి వయస్సు అక్కరలేదు. తనకు మొదటినుండే తెలుసు. ఎందుకంటె సమస్త సృష్టిని తన హస్తమునందుంచుకున్నవాడు. తక్షణమే 'మీకు ఏమి కావాలని వచ్చారు', అని ప్రశ్నించాడు. 'యీ దినము యితడు శవము. రేపటిదినము మీరు. ఎవ్వరూ శాశ్వతముకాదు', అన్నాడు. అప్పుడు పిల్లలు అడిగారు, 'మేము యితని తల్లితండ్రులకేమని చెప్పాలి', అని. బాబా 'జరిగింది చెప్పండి' అన్నాడు. జరిగింది చెబితే అవమానము. జరగంది చెబితే అసత్యము. అసత్యము చెప్పమని బాబా చెప్పలేదు. అవమానము జరగాలని తాను కోరలేదు. 'మీకు కావలసింది ఏమిటి?' అని అడిగాడు. 'ఈ పిల్లవానిని బ్రతికించండి' అని కోరుకున్నారు ఆ పిల్లలు. తక్షణమే కూర్చొని ఆ పిల్లవాని తలను తొడపై పెట్టుకున్నాడు, తల నిమురుతూ ఉన్నాడు.

**పత్రిగ్రామ సముద్భూతం ద్వారాకామాయి వాసినం**
**భక్తాభీష్టప్రదం దేవం సాయినాథం నమామ్యహం**

'పత్రిలో పుట్టినవాడను, యిప్పుడు ద్వారకామాయిలో ఉన్నాను. మీ అభీష్టములను నేను నెరవేర్చుటకు పూనుకుంటున్నాను. సాయినాధునికి శరణుకండి' అన్నాడు. అప్పుడు అందరూ బాబా పాదములు పట్టుకున్నారు. తక్షణమే ఆ పిల్లవాడు లేచాడు. అప్పటినుంచి బాబా ప్రభావప్రచారములన్నీకూడను లోకములో అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఈ జగత్తునందు సత్యము ఎంతో కనిపించకుండా ఉంటున్నాది. విద్యార్థులారా! మనము నివసించే భూమియందు సర్వత్ర జలముంటున్నాది. ఒకచోట చాలా లోతుగా ఉండవచ్చు ఒకచోట బాగా పైకి ఉండవచ్చు. జలములేని భూమి ఎక్కడా కనిపించదు. అయితే జలము కావాలంటే ఎట్లా? ఏమి చేయాలి. ఆ జలమునకు, మన దృష్టికి మధ్య అడ్డముగా పేరుకున్న మట్టిని తీసివేయాలి. ఆ మట్టి తీసివేస్తే జలము కనిపిస్తుంది. ఆ మట్టి అజ్ఞానము. ఆ మట్టియే అహంకారము. ఆ మట్టియే అసూయ. ఆ మట్టియే రాగము. ఆ మట్టియే ద్వేషము. సర్వము యీ మట్టియే. అంతా మట్టినుంచి పుట్టినదే. అంతా మట్టిమయమే. మన దేహమే మట్టిమయము.

srisathyasaivachanamrutam

**జగత్తులో రూపనామములు భిన్నముగా కన్పించినప్పటికిని మట్టి మట్టే!**

'ఎచ్చటపుట్టెనచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్'. చిన్న ఉదాహరణము. ఒక మట్టి పాత్ర ఉంది. ఆ పాత్రతో నీరు తీసుకుంటున్నావు. వంట చేసుకుంటున్నావు. పదార్థములు నిలువ చేస్తున్నావు. నీవు నీరు తెస్తుంటే చేయి జారి క్రిందపడిపోయింది. కుండ క్రిందపడి ముక్కలైపోయింది. దాన్ని అక్కడే వదిలేస్తావు. ఏమైపోతుంది? దానిపైన కార్లు, బస్సులు, లారీలు, మనుష్యులు అందరు నడచిపోవడంవల్ల యింకా ముక్కలు యింకా ముక్కలు కట్టకడపటికి మట్టిగా మారిపోతుంది. కుండ ఎక్కడనుంచి వచ్చింది? మట్టినుంచి వచ్చింది. తిరిగి మట్టిగా పోయింది. ఒక విత్తనము భూమిలో నాటావు. విత్తనమునుండి మొక్క వచ్చింది. మొక్క క్రమేణా వృక్షమైంది. వృక్షములో కొమ్మలు, రెమ్మలు అభివృద్ధి అయిపోయినాయి. లక్షలు, వేలు ఆకులు తయారైనాయి. ఆకులాకుల మధ్యలో పూలు పుడుతూ వచ్చాయి. ఒక్కొక్కటి రాలి పోయినప్పుడు పిందెగా తయారైనాయి. ఈ కొమ్మలు, ఆకులు, పూలు, పిందెలు ఏమిటి? అంతా మట్టియే! భిన్నరూపములుగా కనుపిస్తున్నాయిగానీ అంతా మట్టి రూపమే! అదే విధముగా ఈ జగత్తులో రూపనామములు భిన్నభిన్నముగా కనిపించినప్పటికిని మట్టి మట్టే! 'మట్టిగలుపును జన్మంబు మానవుండు'. మట్టినుండి వచ్చినవాడే! ఎట్లా వచ్చినాడు, మట్టినుంచి? చిన్న ఉదాహరణము. మనం చలికోసం మంటవేసుకున్నాము. చెత్త తెచ్చుకొని మంట వేసుకున్నాము.

**ఎట్టి మంటయో అట్టి పొగ**
**ఎట్టి పొగయో అట్టి మేఘం**
**ఎట్టి మేఘమో అట్టి వర్షం**
**ఎట్టి వర్షమో అట్టి పంట**
**ఎట్టి పంటయో అట్టి వంట**
**ఎట్టి వంటయో అట్టి దేహం.**

తిన్న ఆహారమునుండి మీ దేహము వచ్చింది. మట్టినుంచి వచ్చి మట్టిలో చేరిపోతుంది. ఈ సత్యాన్ని గుర్తించిన మహానీయులే దేహమును త్యాగము చేసి దైవమును విశ్వసించి నిజమైన

srisathyasaivachanamrutam

దేహిని ఆరాధిస్తూ వచ్చారు.

**దేహమును సత్కార్యములలో ప్రవేశపెట్టి సద్వినియోగము చేసుకోండి!**

అయితే, దేహమును త్యాగము చేయమని నేను చెప్పటంలేదు. ఉన్నంతవరకు దీన్ని కాపాడుకోండి. చక్కగా సద్వినియోగము చేసుకోండి. సన్మార్గములో ప్రవేశపెట్టండి. సత్కీర్తిని అందుకోండి. సదుద్దేశ్యముతో జీవించండి. హంతకుని చేతిలో కత్తి ఉంటే అందరి ప్రాణం తీస్తాడు. డాక్టరు చేతిలో కత్తి ఉంటే రోగము నివారణ చేస్తాడు. కాబట్టి, కత్తిది దోషము కాదు. దాని పట్టినవానిది, దోషము. బజారులో ఒక మంగలికొట్టువాడు, ఒక బీడికొట్టువాడు ఒకరితో ఒకరు పోట్లాడుకొని ఒకరినొకరు కొట్టుకున్నారు. చిన్నగా చేతిపై రాసుకుంది కత్తి. తక్షణమే పోలీసు వచ్చి కేసుపెట్టి జైలులో వేస్తాడు. రక్తముకూడా అంత కనిపించటంలేదు. దీనికే యింత పెద్ద పోలీసు కేసుగా వచ్చింది. కారణం ఏమిటి? వీనికి ఒకరిని కత్తితో కొట్టే అధికారము లేదు. అయితే, ఒక డాక్టరున్నాడు. రేపటి దినము మీ పొట్టకోస్తాడు. ఆపరేషన్ చేస్తాను అని డిక్లేరు చేశాడు. బంధువులు, మిత్రులు అందరు వచ్చేశారు. దేహము తీసుకెళ్లారు. కోశాడు. దోషము నివారణ చేసి కుట్లు వేశాడు. Intensive Care Unit లో పెట్టారు. బాగైంది. చిన్న కత్తి గాటైతే పోలీసు స్టేషనులో పెట్టారు. కాని, డాక్టరును జైలులో ఎందుకు పెట్టకూడదు? డాక్టరు మంచి చేశాడు. వాడు చెడ్డ చేశాడు. చేసిన పనులలో ఉంటున్నాది మంచి, చెడ్డ. హనుమంతుడు సీతాన్వేషణకోసం లంకలో ప్రవేశించాడు. అన్నింటికి అగ్నిపెట్టాడు. ఆ మంటలలో రాత్రి పట్టపగలువలె కనిపిస్తున్నాది లంక. కానీ, అట్టి హనుమంతుడు మహానుభావుడని అతనికి నమస్కారము చేస్తున్నారు. దేనికోసం? అతను చేసింది మంచిది. అదే ఒక చిన్న పిల్లవాడు బీడికాల్చి కుప్పపై వేస్తే యింటికి నిప్పు అంటుకుంది. వీడు యింటిని కాల్చాడని వీడిని అందరు పట్టుకొని బాదేస్తారు. మంచిని కాల్చినవాడు, యీ పిల్లవాడు. చెడ్డను కాల్చింది, హనుమంతుడు. మనలోనున్న చెడ్డను కాల్చండి. దుర్గుణములు, దురాలోచనలు, దుర్బుద్ధులు, దుశ్చింతలు, అసూయ, క్రోధము యివన్నీ కాల్చివేయండి. సద్గుణము, సదాచారము, సత్ప్రవర్తన, సత్‌శీలము యిలాంటి వాటిని పెంచండి. అప్పుడు మీరు ఎంతో ఆదర్శవంతమైన

sri sathyasai vachanamrutam

విద్యార్థులుగా రూపొందుతారు. ఒక కోతికి అంత ఘనకీర్తి వచ్చింది. వాని పేరు 'వానర'. 'వానర' మూడు అక్షరములు. మానవునికి 'వ' తీసేశారు. 'నర' అయినాడు. వాలముంది కాబట్టి 'వానరు'డన్నాడు. వాలము లేదు కాబట్టి 'నర' అన్నారు. అయితే మానవునికి తోకపోయిందిగానీ, బుద్ధులింకా పోలేదు. ఎప్పుడు తోక పోయిందో అప్పుడే బుద్ధులుకూడా పోవాలి. వానర బుద్ధులన్నీ పోవాలి. నరజీవితము జీవించాలి. నర జన్మము సార్థకము చేసుకోవాలి. ఆదర్శ మహర్షులు అనాదికాలమునుండి ఈ విషయాన్నే భారతదేశములో ప్రచారప్రబోధలు సల్పుతూవచ్చారు. మనము నరులము, వానరులము కాదు.

**మన దృష్టిని దైవమువైపు మరల్చినప్పుడు మనము ఆదర్శ పురుషులుగానే రూపొందుతాము**

ఏదైనా గుడికి వెళ్ళండి. శివుడు అక్కడవుంటే ఎదురుగా నంది వుంటుంది. మొట్టమొదట నందికి నమస్కారము చేసుకొని లోపలకు వెళ్లాలి. ఎందుకోసం నందికి నమస్కారము చేయాలి? దాని దృష్టి దైవమువైపున ఉంటున్నాది. అది ప్రకృతివైపు చూడటంలేదు. దృష్టి ఈశ్వరునిపైనే పెట్టింది. అట్టి దృష్టి కలిగింది కాబట్టి అది మృగమైనా దానికి వందనము వస్తుంది. మన దృష్టి దైవమువైపు పెట్టినప్పుడు మనము ఆదర్శ పురుషులుగానే రూపొందుతాము. రాములకు హనుమంతుడు సేవకుడు. ఏ పని చెప్పినప్పటికి కాదు, రాదు, లేదు అనే పదమే అతనికి రాదు. రాములను చూస్తే హనుమంతుడు దీనుడుగా నిలుస్తాడు. రావణుని దగ్గర ధీరుడు. చెడ్డవాని దగ్గర ధీరుడై నిల్చాడు, భగవంతుని దగ్గర దీనుడై నిల్చాడు. అందువలననే హనుమంతుని సీతాన్వేషణకు పోయి రమ్మన్నాడు. హనుమంతుడు తాను ఈ కార్యము నెరవేర్చగలనా అని ఏ మాత్రము సందేహమునకు అవకాశము యివ్వలేదు. 'భగవంతుని ఆజ్ఞ. నాకు చెప్పినవాడు ఆ శక్తికూడా తానే యిస్తాడు'. అంతటి విశ్వాసము హనుమంతునకు. 'నేను కోతినే! నేను యిన్ని మైళ్లు దాటవలెనే, సముద్రము దాటవలెనే, నా చేతకాదే, ఎందుకోసం నన్ను బాధపెడుతున్నాడు రాముడు', అని ఏమాత్రము విచారము చేయలేదు. ఆజ్ఞచేసినవాడు శక్తినికూడా తానే యిస్తాడు. ఆజ్ఞ శిరసావహించటమే నా ప్రధాన ప్రమాణము అనుకుని

sri sathyasai vachanamrutam

రామునికి నమస్కారం చేసాడు, వెళ్లాడు. అనగా ఏమిటి? అంతటి గాఢ విశ్వాసము. ఇలాంటిది చేస్తానో చేయలేనో, నాకు శక్తి ఉందో లేదో, నేను ఏ విధమైన పరిస్థితికి పోతానో అనే సందేహమునకు అవకాశమివ్వలేదు. కానీ యీనాటి ప్రజలు

**మంచిమాట వినరు మనసిచ్చి చెప్పిన**
**చెడ్డమాట త్వరగ చెవిని పడును**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురే**
**ఎన్ని విద్యలుండి ఏమి ఫలము?**

ప్రేమతో, మనస్సుతో చెప్పినా, ఆ మంచిమాటలు వినరు. చెడ్డమాటలు సూటిగా వెళ్లిపోతాయి. ఆ చెవిలో వెళ్లిన మాటలు హృదయానికి గుచ్చుకుంటాయి. కలియుగ ప్రభావము యింత అనాగరికతగా ఉంటున్నాది. దీనికి నాగరికత అని పేరు పెడుతున్నారు. కలియుగము కాదిది, కలహయుగము, కల్మషయుగము, మనము సులభంగా సాధించాలి. ఎలా?

**భగవత్ప్రేమకు పాత్రులైతే ఎంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చు**

భగవత్ప్రేమకు పాత్రులుకావాలి. ప్రేమకు పాత్రులైతే ఎంతటి ఘనకార్యమైనా సాధించవచ్చు. ఇది చేతనౌతుంది, యిదికాదు, అనే సందేహమునకు అవకాశము ఉండదు. కనుక ప్రేమకు పాత్రులుకండి! ఎట్లా పాత్రులు కావాలి? ఆ ప్రేమ నీయందుకూడా ఉంటున్నది. ఆ రెండు ప్రేమల ఏకత్వమునకు ప్రయత్నం చేయాలి. అదే I and you are one అని రెండు దేహములు, ఒక్క ప్రాణము. అది నిజమైన ఆదర్శము. 'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ' ఎంత చక్కగా ఉంటున్నాది!

**సకల వేదాంత గ్రంథాల సారమెల్ల**
**ఒక్క వాక్యాన చెప్పుదు నొక్కసారి**
**సకల జీవులయందున్న ఆత్మ, నేను**
**ఒక్కటేయని మది తలపరయ్య.**

srisathyasai vachanamrutam

ఆత్మ, భగవాన్ నేను ఒక్కటే. All are one, be alike to every one. ఇట్టి తత్త్వము ఏనాడు కలుగుతుందో అప్పుడే ఏకత్వము ప్రాప్తిస్తుంది. అదియే 'సర్వ వేదాంత గ్రంథాల సారమంత' ఒక్క వాక్యములో నిల్చిపోయింది. 'అందరియందున్న ఆత్మ, నీవు ఒక్కటే', అనే సత్యము నీవు విశ్వసించాలి. వాడే దైవమును పొందుటకు అర్హుడౌతాడు. అప్పుడు దైవము అతనికి దాసుడైపోతాడు. పూర్వము ఒక భక్తుడు ఈ విధంగా ప్రార్థిస్తాడు.

**దాసాను దాసుడను కావలెనురా**
**నీ దాసులకు నే సేవనే చేయవలెరా ॥దాసా॥**
**ఆలుబిడ్డలుకూడి వేళవేళలయందు**

ఆలుబిడ్డలు చేరి వేళవేళల భగవంతుని సేవచేసుకుంటే కుటుంబమంతా తనకు అర్పితమై పోతుంది. అందువల్లనే భగవంతుని 'భక్తపరాధీనుడు' అన్నారు. భక్తునికి ఆధీనుడైపోతాడు. ఒక్క క్షణమైనా భక్తుని విడిచి అడుగు ముందుకు వేయడు. అంతటి సులభప్రియుడు, భగవంతుడు. చాలా ప్రసన్నుడైపోతాడు. వెన్నను కరిగించాలంటే వేడి చూపించాలి. కానీ భగవంతునికి ఏ వేడీ చూపనక్కరలేదు. కరిగిపోతాడు, కదలిపోతాడు, కరిగి ప్రవహిస్తాడు.

**(తేదీ 20-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam